క్లుప్తంగా

సన్మానం

పోరుమామిళ్ల : బద్వేలు మార్కెట్‌యార్డు చైర్మన్ సుప్రజమ్మ దంపతులను మంగళవారం బీజేపీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలోబీజేపీ జిల్లా అధ్యక్షుడు జంగిటి వెంకటసుబ్బారెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు పుప్పాలశ్రీనాథ్‌రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కందుల మురళీమోహన్‌రెడ్డి, రమణాచారి, పోరుమామిళ్ల మండల బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు బహిరంగ సభ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక జమ్మలమడుగు బైపాస్‌రోడ్డు వాసవీ సర్కిల్ సమీపంలోని భారత్ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం సాయంత్రం 6.30 గంటలకు జమా అతె ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో నేటి సమాజానికి అంతిమ దైవ ప్రవక్త మహమ్మద్ సందేశం అనే అంశంపై బహిరంగ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు జమా అతె ఇస్లామి హింద్ జిల్లా అధ్యక్షుడు రహమతుల్లా తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అరబిక్ క్యాలెండర్ ప్రకారం ప్రస్తుత మాసం రబివుల్ అవ్వల్ మాసం అని, ఈ నెలలో మహమ్మద్ ప్రవక్త జన్మించారని తెలిపారు. మానవాళికి ఆయన చూపిన సన్మార్గాన్ని, సంస్కరణలను, బోధనలు నేటి సమాజానికి అవసరమన్నారు. కార్యక్రమంలో జమా అతె ఇస్లామి హింద్ కార్యదర్శి మహబూబ్‌ఖాన్, పట్టణాధ్యక్షుడు షఫివుల్లా, షరీఫ్ పాల్గొన్నారు.

13న జాబ్‌మేళా

పోరుమామిళ్ల : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 13వ తేదీ శనివారం హెచ్‌ఎస్ఎన్ టెక్ సొల్యూషన్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ప్రముఖ ఎలక్ట్రానిక్ కంపెనీ సీపీ ప్లస్, ఎయిల్ డిక్సన్ టెక్నాలజీస్ ఇండియా లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగ అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. 19–32 సంవత్సరాల లోపు వయస్సు కలిగి పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బి.టెక్ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఉదయం 10 గంటలకు బయోడేటాతో పాటు ఒరిజినల్ లేదా జిరాక్స్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. వివరాలకు 9398683293, 8985093660, 9652005757 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

పెద్దలను గౌరవించాలి

అట్లూరు : విద్యార్థులు పెద్దలను గౌరవించడం అలవర్చుకోవాలని స్థానిక ఎస్ఐ రామకృష్ణ పేర్కొన్నారు. మండల కేంద్రమైన అట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం 9, 10 తరగతుల విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యతోపాటు సంస్కారం, పెద్దలను గౌరవించడం, గురువులను పూజించడం, గౌరవప్రసాదమైన పద్ధతులను అలవర్చుకోవాలని సూచించారు. సెల్ ఫోన్లకు దూరంగా ఉంటూ తప్పుడు వ్యసనాలకు ఆమడ దూరంలో ఉండాలని, ఈ పద్ధతులను అలవర్చుకుంటే భవిష్యత్తు బంగారమేనని ఆయన పేర్కొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

ప్రొద్దుటూరు : కోవిడ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డికి కోవిడ్ కార్మికుల యూనియన్ నాయకులు వినతి పత్రం అందించారు. నాయకులు మాట్లాడుతూ కోవిడ్ సమయంలో మున్సిపాలిటీలో 95 మంది కార్మికులను రోజుకు రూ.400 చొప్పున వేతనంతో తీసుకున్నారని తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వారికి రోజుకు రూ.570 చెల్లించాలని కోరారు. కార్మికులకు సంవత్సరం దాటిపోయినా ఇంత వరకు పనిముట్లు, కొబ్బరి నూనె, సబ్బులు, యూనిఫాం ఇవ్వలేదన్నారు. గతంలో మార్కెట్‌లో పనిచేస్తున్న ముగ్గురికి పెండింగ్ వేతనాలను చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోవిడ్ కార్మికుల యూనిన్ గౌరవాధ్యక్షుడు సాల్మన్, అధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి మేరి బాబు, రాజకుమార్, కమిటీ సభ్యులు ప్రసన్న, దావీదు, శివ, ప్రవీణ్, జైసింహా, శిఖామణి, నరసింహులు, ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు

కాశినాయన : విద్యతోనే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని ఎంఈఓ మహ్మద్ షఫీ తెలిపారు. మంగళవారం మండలంలోని రెడ్డికొట్టాల జెడ్పీ హైస్కూల్‌ను ప్రార్థనా సమయంలో ఎంఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకుని చదువులో రాణించి తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలన్నారు. బడి ఈడు పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలల్లో చేరాలని, ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. ఉన్నత విద్యార్హత కలిగిన ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారన్నారు. అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలించారు. పాఠశాల ఆవరణలోని మొక్కలను పరిశీలించి పచ్చదనంపై ఉపాధ్యాయులు చూపుతున్న శ్రద్ధను ప్రశంసించారు. ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందజేత

బ్రహ్మంగారిమఠం : మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలకు నెలవారీ పరీక్షలకు వచ్చే గర్భిణులు, బాలింతలకు మంగళవారం దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ ఆదేశాల మేరకు భోజన సదుపాయం కల్పించినట్లు మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి తెలిపారు. ప్రభుత్వ వైద్యాధికారి సంపత్ కుమార్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం నుంచి భోజన సదుపాయం ఏర్పాటు చేయడమనేది ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యంతోనే యూరియా కొరత


నిరసన ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, నాయకులు


బద్వేలు అర్బన్: నిరసన తెలుపుతున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, నాయకులు

- యూరియా బ్లాక్ మార్కెట్‌పై మైదుకూరులో కదం తొక్కిన రైతాంగం
- మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి
- వైఎస్సార్‌సీపీ పిలుపుతో అన్నదాత పోరు విజయవంతం

మైదుకూరు : కూటమి ప్రభుత్వ వైఫల్యంతోనే రైతులకు యూరియా కొరత ఏర్పడిందని మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ఆరోపించారు. యూరియా బ్లాక్ మార్కెట్‌పై వైఎస్సార్‌సీపీ నిర్వహించిన అన్నదాత పోరు కార్యక్రమం మంగళవారం మైదుకూరులో విజయవంతమైంది.ముందుగా ప్రకటించిన ప్రకారం స్థానిక ప్రొద్దుటూరు రోడ్డులోని మూలబాట వీధి వద్ద నుంచి భారీ ర్యాలీ నిర్వహించాల్సి ఉండగా, పోలీసులు అమలు చేసిన 30 యాక్ట్ కారణంగా కడప రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద నుంచి ర్యాలీ ప్రారంభమైంది. వందలాది మంది రైతులు వైఎస్సార్‌సీపీ శ్రేణులు ర్యాలీలో పాల్గొన్నారు. అయితే ర్యాలీ ప్రధాన రహదారిపైకి రాకముందే అర్బన్ సీఐ రమణారెడ్డి ర్యాలీకి అనుమతి లేదని, వ్యవసాయ కార్యాలయం వద్దకు కొద్ది మందిని మాత్రమే అనుమతిస్తామని మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డితో అన్నారు. తాము పోలీస్ 30 యాక్ట్‌ను ఉల్లంఘించబోమని కొద్ది మందితో మాత్రమే వ్యవసాయ కార్యాలయం వద్దకు వెళతామని మాజీ ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆ మేరకు కడప రోడ్డు నుంచి వ్యవసాయ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో యూరియా సరఫరా చేయలేని ముఖ్యమంత్రి చంద్రబాబు రాజీనామా చేయాలి.. సీఎం డౌన్ డౌన్.. కూటమి ప్రభుత్వం దిగిపోవాలని రైతులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వ్యవసాయ కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డితోపాటు కొందరిని మాత్రమే లోపలికి పంపించిన పోలీసులు పెద్ద సంఖ్యలో ఉన్న రైతులను వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను లోపలకు వెళ్లనీయకుండా గేట్‌ను మూసివేశారు.

యూరియా కొరత సమస్య ఎలా వచ్చింది?

రైతులకు యూరియా అందించకుండా కొరత ఎలా వచ్చిందో చెప్పాలని వ్యవసాయ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మైదుకూరు ఏడీఏ కృష్ణమూర్తిని ప్రశ్నించారు. ఖరీఫ్ ముగుస్తున్నా ఇంత వరకు రైతులకు సరిపడా యూరియాను ప్రభుత్వం ఎందుకు సరఫరా చేయలేదని ఆరా తీశారు. కేసీ కాలువ, ఇతర ఆయకట్టు కింద ఎంత మేరకు పంటలు సాగవుతాయి, ఎంత మేరకు యూరియా అవసరమవుతుంది అనే దానిపై నివేదికలు పంపారు కదా అన్నారు. మరి సరిపడినంత యూరియా ఇవ్వలేదంటే ప్రభుత్వం రైతుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, ముమ్మాటికి యూరియా కొరత ప్రభుత్వ వైఫల్యం వల్లేనని మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ఆరోపించారు. యూరియా సరిపడినంత అందించాలని, బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించాలని కోరుతూ ఆయన వినతి పత్రాన్ని ఏడీఏకు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ప్రభుత్వ మాజీ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు నేట్లపల్లి శివరాం, మైనార్టీ విభాగం అధ్యక్షుడు మదీనా దస్తగిరి, ఎంపీపీలు తెలిదేల లక్ష్మయ్య, జయచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ రఘురామిరెడ్డి, ఏవీ సుబ్బారెడ్డి, ఇరగంరెడ్డి శంకర్‌రెడ్డి, గల్లా నరసింహారెడ్డి, కేపీ లింగన్న, ఎంఆర్ఎఫ్ సుబ్బయ్య, భరత్, మురళీమోహన్‌రెడ్డి, రాఘవరెడ్డి, పార్టీ రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు జి.నాగిరెడ్డి, మాజీ అధికార ప్రతినిధి రాజశేఖర్‌రెడ్డి, రవిశంకర్‌రెడ్డి, శెట్టిపల్లె సిద్ధారెడ్డి, ఓబులరెడ్డి, మూలే సుధాకర్‌రెడ్డి, కిరణ్మయి పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

– ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : రైతులకు అవసరమైన యూరియాను అందించి పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందిందని ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో రైతులు పడుతున్న కష్టాలను దృష్టిలో ఉంచుకుని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం బద్వేలు కేంద్రంగా చేపట్టిన అన్నదాత పోరు కార్యక్రమం విజయవంతమైంది. ఇందులో భాగంగా స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం ఆర్డీఓ చంద్రమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్నదాతల పాలిట చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ పాలన శాపంగా మారిందని దుయ్యబట్టారు. రైతులు యూరియా అందక అష్టకష్టాలు పడుతుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు గాని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు గాని స్పందించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్యరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి గురుమోహన్, పీఆర్‌ఆర్‌డీ మాజీ ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, సగర విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బంగారుశీనయ్య, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ, ఆయా మండలాల అధ్యక్షులు సుందర్‌రామిరెడ్డి, చల్లారవిచంద్రారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, మల్లేశ్వర్‌రెడ్డి, సుదర్శన్, హనుమంతరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రామసుబ్బారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శులు రాజీవ్‌బాషా, బ్రహ్మానందరెడ్డి, నాగేశ్వర్‌రావు, మున్సిపల్ వైస్‌చైర్మన్ గోపాలస్వామి, రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, జెడ్పీటీసీ పోలిరెడ్డి, ఆయా కార్పొరేషన్ల మాజీ డైరెక్టర్లు డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి, కేశవరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై ఆందోళన చేస్తే పోలీసుల బలాన్ని ప్రయోగిస్తారా

అన్నదాత పోరు ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : రైతులకు యూరియా కొరతను తీర్చాలని, రైతు సమస్యలపై ఆందోళన చేస్తే ప్రభుత్వం పోలీసుల బలాన్ని ప్రయోగించి అడ్డుకోవడం సబబు కాదని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం మున్సిపల్ కార్యాలయం నుంచి గాంధీ రోడ్డు మీదుగా వ్యవసాయ మార్కెట్ యార్డు వరకు రైతులు, పార్టీ శ్రేణులతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాచమల్లు మాట్లాడుతూ ఏ మాత్రం కూటమి ప్రభుత్వం రైతులకు మేలు చేయడం లేదన్నారు. ఎన్నికల హామీ మేరకు రూ.20వేలు రైతు భరోసా చెల్లించడం లేదని, విత్తనాలు, ఎరువులు అవసరమైన మేరకు సరఫరా చేయడం లేదన్నారు. చివరికి వ్యవసాయ పనిముట్లు ప్రభుత్వం ఇవ్వకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రైతులకు యూరియా ఇవ్వకుండా బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకుంటున్నారని, టీడీపీ నాయకులు సొసైటీల ద్వారా ఇష్టమొచ్చినట్లు తీసుకెళుతున్నారన్నారు.

పోలీస్ యాక్ట్ పేరుతో బెదిరిస్తున్నారు

ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏ కార్యక్రమం నిర్వహించినా పోలీస్ 30 యాక్ట్ పేరుతో ప్రభుత్వం పోలీసుల ద్వారా బెదిరిస్తోందని రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. పోలీసు చర్యలకు భయపడమని అన్నారు. రైతుల కోసం జైలుకు వెళ్లడానికైనా సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ జేష్టాది శారద, మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, వైస్ చైర్మన్‌లు పాతకోట బంగారు మునిరెడ్డి ఆయిల్ మిల్ ఖాజా, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పోరెడ్డి నరసింహారెడ్డి, ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు మార్తల ఓబుళరెడ్డి, బాణా కొండారెడ్డి, వెలవలి రాజశేఖరరెడ్డి, రాజుపాళెం మాజీ ఎంపీపీ మెట్టుపల్లె ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత

పోలీసులు అడ్డుకోవడంతో అన్నదాత పోరు ర్యాలీలో ఉద్రిక్తత పరిస్థితులు చోటు చేసుకున్నాయి. మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న పార్కు వద్ద నుంచి మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ర్యాలీని ప్రారంభించారు. గ్రామాల నుంచి వచ్చిన రైతులు ఎడ్ల బండ్లతో ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ కొంత దూరం వస్తూనే పోలీసులు అడ్డుకున్నారు. 30 యాక్ట్ అమలులో ఉందని, ర్యాలీ నిర్వహించవద్దని సూచించారు. తాము శాంతియుతంగానే ర్యాలీ చేసి అధికారులకు వినతి పత్రం సమర్పిస్తామని రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. పోలీసులు స్వయంగా బండికి ఉన్న ఎడ్లను తప్పించి ర్యాలీని నిలిపి వేశారు. కార్యక్రమంలో ఆప్కాబ్ మాజీ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీ, గోనా ప్రభాకర్‌రెడ్డి, భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, ప్రొద్దుటూరు కోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షురాలు గజ్జల కళావతి, నాయకులు నందిమండలం వీరారెడ్డి, తుపాలకు భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు గరిశపాటి లక్ష్మీదేవి, లావణ్య, ముదిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, రాగుల శాంతి, బంకా లక్ష్మిరెడ్డి, నక్కం శ్రీనివాసులు, ఎంపీటీసీ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.


నిరసన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, పార్టీ శ్రేణులు

ప్రొద్దుటూరు జిల్లా సాధన సమితికి ఆర్యవైశ్యసభ మద్దతు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు జిల్లా సాధన సమితికి ఆర్యవైశ్యసభ పూర్తిగా మద్దతు ఇస్తోందని ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహన్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొద్దుటూరుకు జిల్లా కావాల్సిన అన్ని హంగులు ఉన్నాయని, రెవెన్యూ పరంగా ముందంజలో ఉందని ఆయన పేర్కొన్నారు. రెండో ముంబైగా పేరు గాంచిన ప్రొద్దుటూరు దసరా ఉత్సవాల్లో రెండో మైసూరుగా కూడా ఖ్యాతి గాంచిందని తెలిపారు. ప్రొద్దుటూరు నుంచి జీఎస్టీ కూడా అధిక మొత్తంలో ప్రభుత్వానికి ఆదాయం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సభ మద్దతు కోరడానికి వచ్చిన ప్రొద్దుటూరు జిల్లా సాధన సమితి కన్వీనర్లు డాక్టర్ నాగదస్తగిరిరెడ్డి, న్యాయవాది సీవీ సురేష్, ఎన్జీఓ అసోసియేషన్ అధ్యక్షుడు రఘురామిరెడ్డి, శివారెడ్డి తోపాటు ఇతర కన్వీనర్లుతో మాట్లాడుతూ జిల్లా సాధన సమితికి తన వంతు సహకారం ఉంటుందని బుశెట్టి రాంమోహన్‌రావు తెలిపారు.

అధ్వాన హాస్టల్‌తో విద్యార్థుల అవస్థలు

– తోటపల్లి గురుకులం సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్

బ్రహ్మంగారిమఠం : అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యానికి విద్యార్థులు అనారోగ్యాల బారిన పడుతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్ ఆరోపించారు. మంగళవారం మండలంలోని తోట్లపల్లి గ్రామం సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మహా గురుకుల పాఠశాలను ఎస్ఎఫ్ఐ మండల నాయకులతో కలసి సందర్శించారు. విద్యార్థుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుని పాఠశాలలో గదులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ హాస్టల్‌లో మౌలిక వసతులు కరువయ్యాయన్నారు. పాఠశాలలో 700 మంది విద్యార్థులు చదువుకుంటుండగా కనీస సౌకర్యాలు కూడా కనిపించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కడుపులోకి చేరాల్సిన ఆహారం చెత్త డబ్బాల నిండా కనిపిస్తోందంటే ఆహారం ఎంత అధ్వానంగా ఉందో అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. వంట చేసే ప్రాంతంలో మురికి కాలువ ఉండటం దారుణమని మండిపడ్డారు. పాఠశాలలో పారిశుధ్య లోపం స్పష్టంగా కనిపిస్తోందని ఇక్కడ పని చేస్తున్న అధికారులు ఏం చేస్తున్నారో అర్థం కావడం లేదని అసహనం వ్యక్తం చేశారు. గతంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని అధికారులు చేసిన హామీ నేటికీ నోచుకోకపోవడం దౌర్భాగ్యంగా వారు అభివర్ణించారు. ప్లేట్లు ఏ నీటితో కడుగుతున్నారో అవే నీటిని విద్యార్థులు తాగుతుండటం అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యమేనని తెలియజేశారు. ఇలాంటి పరిస్థితుల నడుమ విద్యార్థులు ఎలా చదువుకోగలరో అధికారులు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. వీటికి తోడు హాస్టల్‌లో సిబ్బంది కొరత వేధిస్తోందని చెప్పారు. అధికారులు గురుకులాన్ని సందర్శించిన పరిస్థితి ఏమాత్రం మారడంలేదని, ఇప్పటికైనా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, జిల్లా ఉన్నతాధికారులు ఈ విషయంపై దృష్టి సారించి హాస్టల్ సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. లేకుంటే ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు అరవింద్, రాజశేఖర్, నాయకులు ప్రదీప్, చైతన్యలు పాల్గొన్నారు.


పాఠశాలలో భోజనశాలను పరిశీలిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై సమీక్ష

పోరుమామిళ్ల : మండలంలోని టేకురుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి రమేష్‌రెడ్డి, జిల్లా స్టాటిస్టికల్ ఆఫీసర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలకు స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాతాశిశు సంరక్షణ లక్ష్యాలను సాధించేందుకు ప్రతి ఒక్కరూ మరింత కృషి చేయాలని, గ్రామస్థాయిలో ఆరోగ్య కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. అనంతరం కొత్రపాటిపల్లె గ్రామంలో మాతాశిశు సంరక్షణ సేవలను క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలించి ప్రజలకు అందుతున్న సేవల స్థితిగతులను పరిశీలించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన సూచనలు చేశారు. సమావేశంలో పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ మేరీఎల్సా, డాక్టర్ శ్రీవిద్య, డాక్టర్ కరిష్మా, పర్యవేక్షక సిబ్బంది సాదు వెంకటేశ్వర్లు, నిర్మలదేవి, రఘురామ్, సరస్వతి, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉపాధ్యాయ సమస్యలపై నిరసన

అట్లూరు : ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి గురువారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలను చేపడుతున్నట్లు ఆ సంఘం నాయకులు పేర్కొన్నారు. మంగళవారం పోరుమామిళ్ల ఏపీటీఎఫ్ కార్యాలయంలో పోరుమామిళ్ల రీజియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను తక్షణమే విడుదల చేయాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మెమో 57ను తక్షణమే అమలు చేయాలని, 30 శాతం ఐఆర్ ఇవ్వాలని, ఉపాధ్యాయులకు రావాల్సిన అరియర్స్ చెల్లించాలన్నారు. అసైన్‌మెంట్ బుక్‌లెట్ విధానాన్ని రద్దు చేయాలని, ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలన్నారు. కస్తూర్బా గాంధీ పాఠశాలల టీచర్లకు రెగ్యులర్ జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, బి.కోడూరు, బి.మఠం మండలాల అధ్యక్ష, కార్యదర్శులు కె.వెంకటరామిరెడ్డి, ఎస్ఎండీ యాసిన్, కె.కృష్ణారెడ్డి, పి.కిరణ్‌కుమార్, కె.చంద్రశేఖర్, వి.వెంకటరామిరెడ్డి, నాగసుబ్బారెడ్డి, రామకృష్ణ, ఎం.హరినాథ్, జె.సుబ్బయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

ఫిజియోథెరపీకి పెరుగుతున్న ఆదరణ

ప్రొద్దుటూరు క్రైం : ఇటీవల కాలంలో ఫిజియోథెరపీకి ప్రాధాన్యత, ఆదరణ పెరుగుతోందని ఫిజియోథెరపీ వైద్యులు తెలిపారు. వరల్డ్ ఫిజియోథెరపీ డే సందర్భంగా పట్టణంలోని ఫిజియోథెరపీ వైద్యులు స్థానిక మైదుకూరు రోడ్డులోని కొవ్వూరు గ్రాండ్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిజియోథెరపీకి సుదీర్ఘ చరిత్ర ఉందని, ఇటీవల కాలంలో ఫిజియోథెరపీ బాగా అభివృద్ధి చెందిందన్నారు. గాయం, వ్యాధుల కారణంగా కదలికలు కోల్పోయిన వారికి ఫిజియోథెరపీతో తిరిగి సాధారణ స్థితికి తీసుకు రావడం జరుగుతుందన్నారు. అలాగే ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజియోథెరపీ ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ వీరకుమార్ రెడ్డి, ప్రెసిడెంట్‌గా డాక్టర్ సుమాదేవి, సెక్రటరీగా డాక్టర్ బి.ఓబులేసు, ట్రెజరర్‌గా డాక్టర్ కె.వెంకటసుబ్బయ్యలను ఎన్నుకోవడం జరిగింది. కార్యక్రమంలో డాక్టర్ గురుచంద్ర, డాక్టర్ రమేష్, డాక్టర్ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.


డాక్టర్ వీరకుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న ఫిజియోథెరపీ వైద్యులు

నానో లిక్విడ్‌ను వినియోగించండి

మైదుకూరు : రైతులు తాము సాగు చేసిన పంటలకు యూరియాకు బదులుగా ఇఫ్కో కంపెనీ తయారు చేసిన నానో లిక్విడ్‌ను వినియోగించాలని మైదుకూరు వ్యవసాయ సహాయ సంచాలకుడు ఎం.కృష్ణమూర్తి తెలిపారు. మంగళవారం మండలంలోని ఉప్పుగుంటపల్లె, గంగాయపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ యూరియా ఎక్కువగా వాడటం వల్ల పంటలకు చీడపీడల ఉధృతి పెరిగే అవకాశం ఉందన్నారు. దాని బదులు నానో లిక్విడ్ ఎకరాకు అర లీటరు వినియోగించాలని సూచించారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలను తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలన్నారు. మండల వ్యవసాయ అధికారి బాలగంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి రైతు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా నగదు బిల్లులు, రశీదులు తీసుకొని భద్రపరచుకోవాలని సూచించారు. అనంతరం వ్యవసాయ అధికారులు ఉల్లి, పసుపు తదితర పంటలను పరిశీలించారు.

గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేయాలి

చాపాడు : గ్రంథాలయానికి వచ్చే పాఠకుల సంఖ్యను పెంచి గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సయ్యద్ అమీరుద్దీన్ తెలిపారు. చాపాడు శాఖా గ్రంథాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలోని రికార్డులను ఆయన పరిశీలించారు. గ్రంథాలయానికి వచ్చే దిన, వార, మాస పత్రికలను పరిశీలించారు. గ్రంథాలయానికి రావాల్సిన పన్ను బకాయిలు సకాలంలో వచ్చేలా చూడాలని తెలిపారు. గ్రంథాలయ అభివృద్ధి, పాఠకుల సంఖ్య, సభ్యత్వాలు తదితర వాటిపై దృష్టి సారించాలని ఆదేశించారు. గ్రంథాలయాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా నిర్వహణ ఉండాలని తెలిపారు.


రికార్డులను పరిశీలిస్తున్న అమీరుద్దీన్

డీఏ బకాయిలు చెల్లించాలి

కలసపాడు : పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల డీఏ బకాయిలను చెల్లించాలని ఎస్టీయూ కలసపాడు మండలశాఖ అధ్యక్షుడు చిన్నపురెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన 2018 జూలై, 2019 జనవరి సంబంధించిన డీఏ బకాయిలు బిల్లులు పెట్టి ఆదాయ పన్ను చెల్లించినప్పటికీ ప్రభుత్వం కాలయాపన చేయడం చాలా దారుణమన్నారు. ఇటీవల ఏపీ సచివాలయ ఉద్యోగులకు ఈ రెండు డీఏలకు సంబంధించి 60 నెలల బకాయిలను వారికి చెల్లించారని తెలిపారు. ఎఆర్సీ బకాయిలు, పెండింగ్‌లో ఉన్న నాలుగు కరువుభత్యం చెల్లించి కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

పెద్దుళ్లపల్లెలో పొలం పిలుస్తోంది

బి.కోడూరు : మండలంలోని పెద్దుళ్లపల్లె గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయాధికారి కౌశిక వరిలో సస్యరక్షణ, ఎరువులు వాడకం గురించి రైతులకు వివరించారు. యూరియా సిఫారసు మేరకే ఉపయోగించాలని, అధిక మోతాదులో వాడడం వలన పంటకు చీడపీడలు అధికమవుతాయని, భూసారం తగ్గిపోతుందని వివరించారు. వివిధ పథకాల గురించి రైతులకు అవగాహన కల్పించారు.

నిబంధనల మేరకే అబార్షన్లు చేయాలి

మైదుకూరు : నిబంధనల మేరకే అబార్షన్లను నిర్వహించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వి.మల్లేష్ అన్నారు. మంగళవారం మైదుకూరులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో బద్వేలు డివిజన్ స్థాయిలో ఆగస్టు నెల అబార్షన్లపై ఆడిట్ నిర్వహించారు. డాక్టర్ మల్లేష్ మాట్లాడుతూ తప్పనిసరి పరిస్థితుల్లోనే అబార్షన్లు చేయాలన్నారు. అబార్షన్ల ప్రక్రియలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

బ్రెయిన్‌స్ట్రోక్‌తో వ్యక్తి మృతి

– నేత్రదానం చేసిన మృతుడి కుటుంబ సభ్యులు

కలసపాడు : మండలంలోని సిద్ధమూర్తిపల్లె గ్రామానికి చెందిన పోలూరి రాములు (45) బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందాడు. రాములు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల మూడు రోజుల క్రితం ఆరోగ్యం బాగాలేక కడపలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం బ్రెయిన్‌స్ట్రోక్‌తో మృతి చెందాడు. మృతునికి భార్య కృష్ణవేణి, ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యులు రిమ్స్ ఆస్పత్రిలో రాములు కళ్లు దానం చేశారు.

నివాళి

కలసపాడు : మండలంలోని ముద్దంవారిపల్లె గ్రామానికి చెందిన అంకెన నారపరెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్యరెడ్డి మంగళవారం ఆయన స్వగృహానికి వెళ్లి భౌతికకాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ తరపున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గురివిరెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు సాయినారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

17న క్రీడా పోటీలు

ప్రొద్దుటూరు : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో ఈనెల 17న నెహ్రూ యువ కేంద్రం సహకారంతో వికసిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. యువకులకు వాలీబాల్, మహిళలకు కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. వివరాలకు 9966475742, 9154195061 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

వాలీబాల్ విజేత బద్వేలు జట్టు

కలసపాడు : మండలంలోని పుల్లారెడ్డిపల్లె గ్రామంలో జరిగిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలలో బద్వేల్ జట్టు విజేతగా నిలిచింది. మేరీ మాత ఉత్సవాల సందర్భంగా సోమ, మంగళవారాల్లో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. బద్వేలు జట్టు ప్రథమ బహుమతిని కైవసం చేసుకోగా పుల్లారెడ్డిపల్లె జట్టు ద్వితీయ బహుమతి సాధించింది.